# కొత్త రచయితలు

# ఉదయరాగం

“అమ్మా!” అంటూ పిలిచింది శ్రీదేవి.

“ఏమిటమ్మా!” పేరంటానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న సీతమ్మ ప్రేమగా అడిగింది.

“అమ్మా! నేను కూడా పేరంటానికి వస్తానమ్మా” అంది శ్రీదేవి.

వెంటనే బదులు పలకలేకపోయింది సీతమ్మ. ఆమె కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. “పేరంటానికి తీసుకువెళ్ళడానికి నాకేమీ అభ్యంతరం లేదమ్మా! కానీ నిన్ను చూసి అక్కడివారు అనే మాటలు ములుకుల్లాగ వుంటాయి. అవి విని నీ మనస్సు తట్టుకోలేదమ్మా! నా మాట విని నువ్వు ఇంట్లోనే వుండమ్మా” కన్నీళ్ళతో నచ్చ చెప్పింది సీతమ్మ.

“అమ్మా! నేనూ మనిషినే. ఎప్పుడూ ఇంట్లో వుంటే బోర్ కొడుతుంది. నాకంటే వెనక పుట్టిన చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిచేసి పంపించారు. నాకు పెళ్ళి చిన్నప్పుడే చేశామని చెబుతున్నారు. అప్పుడే చెయ్యమని మీకెవరు చెప్పారు? చెల్లెళ్ళిద్దరు చక్కగా కాలేజీకి వెళ్ళి చదువుకున్నారు. హాయిగా పెళ్ళిళ్ళు చేసుకున్నారు. పెళ్ళి పేరుతో నా గొంతు కోశారు. చదువుకోనివ్వలేదు. అందరిలాటి బ్రతుకు లేకుండా చేశారు. ఏమిటి నేను చేసిన పాపం? నా భర్త చనిపోతే నాదా తప్పు? భర్త పోతే మరి బ్రతుకే లేదనుకుంటే ఇంక దేనికమ్మా నేను బతికివుండడం? ఎందుకమ్మా నాకీ జన్మ... నేను చచ్చిపోతాను. ఇలా బతకడం నావల్ల కాదు” భోరుమంది శ్రీదేవి.

సీతమ్మ నిర్విణ్ణురాలయింది.

“ఏమేవ్! కాసిని మంచినీళ్ళు తీసుకురా!” అంటూ వచ్చిన వాసుదేవరావు అక్కడ దృశ్యాన్ని చూసి కొయ్యబారిపోయారు.

విషయం విని కన్నీళ్ళు ఒత్తుకుంటూ అన్నారు—

“దేవీ! నేను నీకు ఏ లోటూ జరగకుండా ఎంతో గారాబంగా నిన్ను పెంచాను. తొలిసంతానంగా లక్ష్మీదేవే పుట్టిందని ‘శ్రీదేవి’గా పిలుస్తూ ఆడింది ఆటగా, పాడింది పాటగా, నువ్వు ఏది అడిగితే అది తెచ్చిపెట్టాను. అరుణని, కరుణని కూడా నిన్ను పెంచినట్టు పెంచలేదు. అనుకోకుండా నా ప్రాణస్నేహితుడు రాజారావు మనింటికి వచ్చి నిన్ను చూసి ముచ్చటపడి నిన్ను తన కోడలుగా చెయ్యాలని మాట తీసుకున్నాడు. ముందుముందు ఇద్దరం వియ్యంకులుగా మారతామని సంతోషించాం, పరిహాసాలాడుకున్నాం. మాట ఇచ్చిన నాలుగు నెలలకే రాజారావు తల్లి కన్నుమూస్తూ మనవడి పెళ్ళి చూడాలని కోరిందని ఆఘమేఘాల మీద నీకూ, తన కొడుకు విజయ్‌కీ పెళ్లి జరిపించాడు రాజారావు. ఒక సంవత్సరానికి ఏమీ ఏమవుతుంది? నిశ్చింతగా కల్పిస్తున్నామని తృప్తిపడ్డామే తప్ప ముంచుకురాబోతున్న ప్రమాదాన్ని రాజారావు కానీ, అతని భార్య కానీ, మేము కానీ వూహించలేదు. బొమ్మల పెళ్ళిలా మీ వివాహం జరిపించాక ఏడాది తిరక్కుండానే బడి నుంచి వస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించాడు విజయ్. ఉన్న ఒక్క బిడ్డ పోయినందుకు, మరొకరి కన్నకూతుర్ని అభాగ్యురాలిని చేసినందుకు రాజారావు, చెల్లాయ్ కృంగిపోయారు. నిన్ను తీసుకువెళ్ళి వైధవ్యపు తతంగం జరిపినా, అదంతా లోకం కోసమేనని, ముక్కుపచ్చలారని నీకు మళ్లీ పెళ్ళి చేయమని కోరాడు రాజారావు. నేనే సంఘాన్నీ, కట్టుబాట్లనీ ఎదిరించలేకపోయాను తల్లీ! ఆనాటి నుంచి నేను పడ్డ బాధ పగవాడికి కూడా వద్దమ్మా! నిన్నిలా చూడలేక, నలుగురినీ ఎదిరించలేక నరకం చూస్తున్నాను తల్లీ!” అంటూ వాసుదేవరావు మరి మాట్లాడలేక కూలబడిపోయాడు.

“ఆనాడే నన్ను గొంతునులిమి చంపేసివుంటే, నేను ఈ రోజు రోజూ చస్తూ బ్రతకడం తప్పేది నాన్నా! నన్ను చూసి మీరు బాధపడడం తప్పేది. ఇప్పుడైనా మించిపోయింది లేదు నాన్నా! నేను చచ్చిపోతాను!” డగ్గుత్తికతో అంది శ్రీదేవి.

“విధి బలీయమైంది. దాన్ని మార్చగల శక్తి మానవ మాత్రులకు లేదు. నీతోపాటు మేమూ చస్తాము. ముగ్గురికీ కలిపి విషం తెస్తాను!” గద్గద స్వరంతో అన్నాడు వాసుదేవరావు.

“నాన్నా మీరు....మీరు చావడం ఎందుకు!” ఆశ్చర్యంగా అడిగింది శ్రీదేవి.

“కన్నబిడ్డను బ్రతికించుకోలేని అసహాయ తల్లిదండ్రులకు బ్రతికే హక్కు లేదు తల్లీ! అందుకే ఈ నిర్ణయానికి వచ్చాను” అన్నాడు. అతని గొంతులో ఏదో అడ్డుపడ్డట్టయింది.

“మీకోసం నేను బ్రతుకుతాను” శ్రీదేవి. చెక్కిళ్ళు కన్నీట తడిశాయి.

* * *

ఆ రోజు వాసుదేవరావు హడావిడిగా ఇంట్లోకి వచ్చి “ఏమేవ్, ఒకసారి ఇలారా!” అంటూ పిలిచాడు.

“ఏమిటండీ ఆ గావుకేకలు!” అంటూ వచ్చిన సీతమ్మ హాల్లో కొత్త వ్యక్తులను చూసి నడక వేగం తగ్గించింది. వాళ్లను గుర్తుపడుతూనే

“సిస్టీ నువ్వా! ఎన్నాళ్లయింది నిన్ను చూసి” అంటూ దగ్గరకు వచ్చింది.

“శ్రీహరి పుట్టకముందు! నీకు పెళ్ళిగాకముందు!! అప్పుడే నువ్వు మునలిదానివయ్యావ్వటే... నాన్నా శ్రీహరీ.... ఇదిగో సీతక్క.... ఎప్పుడూ చెబుతుంటానే...నువ్వు చూడని మీ సీతక్క” అంది అహల్య సంతోషంగా. శ్రీహరి వాళ్ళిద్దరినే చూస్తున్నాడు. “అమ్మా! ఈ సీతక్క మాట్లాడుతుంటే నీ గొంతు విన్నట్టుంది” అంటూ మాటలు కలిపాడు. కబుర్లలో కాఫీలు తెచ్చింది సీతమ్మ.

“ఏమండీ, అల్లుడుగారూ! ఎంతమంది పిల్లలు? వాళ్ళు ఏం చేస్తున్నారు?” అడిగాడు వాసుదేవరావు.

“ముగ్గురు ఆడపిల్లలండీ! శ్రీదేవి, అరుణ, కరుణ. అరుణ బి.ఎ. ప్యాసయింది. పెళ్ళి అయింది.

ఆమె భర్త లెక్చరర్. ఒక పాప. కరుణ బి.ఎస్సీ. ప్యాసయింది. పెళ్ళి అయింది. ఆమె భర్త బ్యాంక్‌లో క్లర్క్‌గా చేస్తున్నాడు...” శ్రీదేవి సంగతి ఎలా చెప్పాలో తెలీక మౌనం వహించాడు.

“మరి మీ పెద్దమ్మాయి శ్రీదేవి సంగతి ఏమీ చెప్పలేదు!” అడిగాడు వాసుదేవరావు.

“ఎలా చెప్పాలో నాకు తెలియడం లేదు మామగారూ! శ్రీదేవి ఒక దురదృష్టవంతురాలు. విధి ఆమె జీవితంతో ఆడుకుంది!”

“అంటే కాస్త అర్థమయ్యేలా చెప్పండి!” అడిగాడు శ్రీహరి.


రచయిత్రి చిరునామా

డి. లక్ష్మీరాజేశ్వరి

సలివేరు (పోస్టు) తెనాలి తాలూకా గుంటూరు జిల్లా



క్లుప్తంగా ఆమె గురించి చెప్పాడు వాసుదేవరావు.

"మైగాడ్! ఈ ఇరవయ్యో శతాబ్దంలో కూడా ఇలాంటి ఆచారాలు పాటిస్తున్నారా? సైన్సు ఎంత అభివృద్ధి చెందింది. ఈ రోజుల్లో ఒక మనిషిని చదువుకోనివ్వకుండా కట్టడి చేశారా? తనకి నచ్చిన దుస్తులు వేసుకునే హక్కు కూడా లేదా?" అంటూ ఆశ్చర్యపోయాడు శ్రీహరి. అతను అమెరికాలో ఎం.డి. చేసి స్వదేశానికి వచ్చి ఏడాది కావస్తోంది.

ఆ మాటలకి వాసుదేవరావు ముఖం చిన్న బోయింది. సీతమ్మ కళ్లు చెరువులయ్యాయి. అది గమనించి వాసుదేవరావు నచ్చచెబుతున్నట్టు అన్నాడు—

"చూడండి... మీరు వున్నన్నాళ్ళు ఆమెకు ఏ లోటూ జరగకపోవచ్చు. మీ తరువాత ఆమె బ్రతుకు ఏమవుతుంది? ఒక్కసారి ఆలోచించారా? చదువుకున్నవారు ఇంత అనాలోచితంగా ఎలా ప్రవర్తించ గలిగారు? మీకు మనస్సెలా వచ్చింది? లోకం తెలియని ఆ పసిది మీ ప్రవర్తనను సమర్థిస్తుందనుకోను. ఆమెను అర్థం చేసుకోలేకపోయారు మీరు. ఎంతసేపటికీ లోకం ఏమను కుంటుంది అనేనా ఆలోచన?" సూటిగా అడిగాడు.

ఆ మాటలు శూలాల్లా వారి గుండెల్లో గుచ్చుకున్నాయి.

"నిజమే బాబూ! నేను చాలా తప్పుచేశాను. ఇంత విచక్షణగా నేను ఆలోచించలేకపోయాను. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా ప్రయోజనం వుండదు" విచారంగా అన్నారు రావుగారు. సీతమ్మ కళ్ళు తుడుచుకుని పిన్నిని తనతో పాటు లోపలికి తీసుకువెళ్లింది. శ్రీదేవి వంటగదిలో పనిలో వున్నది.

అహల్య శ్రీదేవిని చూసి ఆశ్చర్యపోయింది. బంగారు బొమ్మలాగ వుంది. 'ముఖాన బొట్టు లేకున్నా, తెల్ల చీరె కట్టుకున్నా ఆమె అందంగానే వుంది' అనుకుంది.

* * *

మరునాడు శ్రీహరి స్నానం చేసి వస్తున్నాడు బాత్‌రూం నుంచి. సరిగ్గా అప్పుడే తల వంచుకుని వస్తున్న శ్రీదేవి అతనికి ఢీకొట్టేంత దగ్గరకు వచ్చాక గమనించి గభాలున ఆగుకుని గాభరాగా అతని వంక చూసింది. తండ్రి తర్వాత తొలిసారిగా మగవాడిని అంత దగ్గరలో చూసిందామె.

సంభ్రమంతో ఆ కళ్ళు సత్తికాయల్లాగా అయినాయి.

'అబ్బ! ఎంత అందంగా వుంది. మనిషికి లేని అందంకోసమే రంగులు వున్నాయి అన్నాడో కవి. ఏ అలంకారాలూ లేకుండానే ఈమె ఎంత అందంగా వుంది! కనీసం నుదుట బొట్టు కూడా లేకున్నా ఆమె ముఖం వింత కాంతులు వెదజల్లుతోంది. అసలీమె అందమంతా ఆ కళ్ళలోనే వుంది' అనుకున్నాడు శ్రీహరి. కొన్ని క్షణాలు ఒకరినొకరు చూసుకున్నారు. తర్వాత తేరుకుని పారిపోయింది శ్రీదేవి.

ఆరోజే వారు వెళ్ళిపోదామనుకున్నారు. శ్రీదేవిని చూసిన తర్వాత ఆ నిర్ణయం మార్చుకున్నాడు శ్రీహరి. సాయంత్రం తను, తల్లీతండ్రీ బయటకు వెళ్ళాలని కూడా చెప్పాడు. ఆ సాయంత్రం సినిమాకి వెళతామని ముగ్గురూ బయలుదేరారు. తమతో శ్రీదేవిని పంపమని అడిగారు. ఆమె "నేను రాను" అని చెప్పింది.

ముగ్గురూ ఇంటి నుంచి బయలుదేరారు. దారిలో "అమ్మా! నాన్నగారూ! నా మాట వింటారు కదూ!" అడిగాడు శ్రీహరి.

"తప్పకుండా!" అన్నారు ఇద్దరూ ఒకేసారి.

"అమ్మా! ఇప్పటికి నా పెళ్ళికోసం చాలా సంబంధాలు చూసి వచ్చారు నాన్నగారు. ఒక్కటీ నచ్చలేదు. మీరు ఏమీ అనుకోనంటే ఒక్క మాట!"

"చెప్పు బాబూ!"

"నేను శ్రీదేవిని పెళ్ళి చేసుకుంటానమ్మా!

(మిగతా 41.వ పేజీలో)

(39..వ .పేజీ తరువాయి)

నా ఊహాసుందరికి సజీవరూపం ఈ శ్రీదేవి. శ్రీదేవిని నేను పెళ్ళి చేసుకుని ఆమెకు సుఖశాంతులనిస్తాను. దేవుడు చెరిపేసిన పసుపు కుంకుమలు నేనిస్తాను. మోడువారిన ఆమె జీవితం చిగురింపచేస్తాను. అదీ మీకు ఇష్టమయితేనే!'' అని ఆగాడతను.

అహల్య వెంటనే అంది– ''బాబూ, శ్రీహరీ! నా మనస్సులో వున్న మాటను నువ్వు చెప్పావు. శ్రీదేవిని చూసిన క్షణం నుంచి నా కోడలుగా చేసుకుందామనుకున్నాను. కానీ నువ్వు ఫారెన్‌లో ఎం.డి. చేసి వచ్చావు. బొత్తిగా చదువు రాని పిల్లను చేసుకోవాలంటే ఇష్టపడవని అడగలేక పోయాను. ఈ విషయంలో మీ నాన్నగారు కూడా అదే సందేహపడ్డారు. దాంతో ఇక నీకు ఆ విషయం చెప్పదల్చుకోలేదు'' అంది.

''నేను చాలా అదృష్టవంతుడినమ్మా! మీలాంటి మంచి మనసున్న తల్లిదండ్రులు ఎంత మందికి వుంటారు!'' మెచ్చుకోలుగా అన్నాడు శ్రీహరి.

ఒక సరైన నిర్ణయం తీసుకున్న ఆనందంతో వెనుదిరిగారు.

''అదేమిటి అప్పుడే వచ్చారు. టిక్కెట్లు దొరకలేదా?!'' అడిగారు వాసుదేవరావు.

''లేదు అబ్బాయ్! నీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలని సినిమా చూడకుండా తిరిగి వచ్చాము!'' అన్నాడు వామనరావు.

''సినిమా చూసి రాలేకపోయారా– తర్వాత అయినా మాట్లాడుకునే వాళ్ళం అంది సీతమ్మ.

''అమ్మాయి సీతా! నేను ఒక మాట అడుగుతాను–నీకు కోపం రాదు కదా?'' అడిగింది అహల్య.

''అడుగు పిన్నీ కోపం ఎందుకు!''

''మీ శ్రీదేవిని మా ఇంటి కోడలు చేసుకుంటాను. మా శ్రీహరికి ఇవ్వడానికి నీకేమయినా అభ్యంతరమా! వీడు అమెరికాలో ఎం.డి. చేసి వచ్చాడు. ఇప్పుడు కేరళలో వాడికి ఉద్యోగం వచ్చింది. మాకు ఒక్కగానొక్క కొడుకు. మాకున్న ఆస్తి అంతా వాడికే. పిల్లాడికి ఏ చెడు లక్షణాలూ లేవు. మీ అమ్మాయిని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు!'' అంది అహల్య.

వాసుదేవరావుకి, సీతమ్మకి మాటలు రాలేదు. శిలాప్రతిమల్లా వుండిపోయారు. వారి ముఖాలలో ఆనందం, ఆశ్చర్యం, సంతోషం, అపనమ్మకం ఒక్కసారిగా కలిగాయి.

కొన్ని నిమిషాలకి తేరుకున్నారు వారు.

''పిన్నీ! నువ్వు అంటున్నది నిజమేనా? మా దేవిని మీ కోడలుగా చేసుకుంటారా? అంతకంటే కావలసినదేముంది? మీరు నిజంగా దేవుళ్ళు. ఆచారాల ముసుగులో మూసుకుపోయిన మా కళ్ళు తెరిపించారు. మోడువారిన నా బిడ్డ బ్రతుకులో మళ్లీ పూలు పూయిస్తామంటున్నారు..... పిన్నీ మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేము. మీ ఇష్టప్రకారమే పెళ్లి చేస్తాము. అరుణ, కరుణకు ఇచ్చినంత కట్నం ఇస్తాము!'' అంది ఆనందంగా సీతమ్మ.

''సీతా! కట్నం అడగలేదు. శ్రీదేవిని అడిగాము. కట్నం ఇవ్వదలచుకున్నదంతా శ్రీదేవికి ఇవ్వండీ! మాకు ఒక్క పైస అక్కరలేదు. ఆమె కోరిక ప్రకారం ఆమె అడిగినవి యివ్వండి!'' అన్నాడు వామనరావు.

''ఇంతకీ సీతక్కా ముందు శ్రీదేవిని అడగండి– నన్ను పెళ్ళి చేసుకోవడం ఇష్టమో, లేదో?'' అన్నాడు శ్రీహరి.

''అలాగే బాబూ!'' అని ఇద్దరూ లోపలికి పోయారు.

ఐదు నిమిషాలకి తిరిగి వచ్చారు. వారి ముఖాలు మతాబుల్లా వెలిగిపోతున్నాయి.

''ఇష్టమే! అంది బాబూ!'' అన్నారు రావు గారు.

''శుభం!'' అన్నాడు వామనరావు. *


నల్లని శిరోజాలు
ఒకటికంటే ఎక్కువ
ఛాయలలో వస్తాయి. మరి
అలాగే గోద్రెజ్ వారి
హెయిర్ డై కూడా.



ప్రవేశపెడుతున్నాం సరిక్రొత్త బ్రౌన్ బ్లాక్

మీ శిరోజాలు దట్టమైన నలుపులో ఉన్నట్లైతే, మీకు అత్యంత ప్రీతికరమైన ఛాయ — ప్రకృతి సహజమైన నలుపును గోద్రెజ్ కలిగియున్నది. మరి మీలోని కొంత మంది కోసం, అంటే దట్టమైన నలుపులో శిరోజాలు లేనివారి కోసం, గోద్రెజ్ వారు ఇప్పుడు ప్రవేశపెడుతున్నారు ఒక సరిక్రొత్త ఛాయలో గల హెయిర్ డై — బ్రౌన్ బ్లాక్, నలుపు యొక్క ఒక లేతవర్ణపు ఛాయను అది మీకు సమకూరుస్తుంది. అత్యంత ఆధునికమైన సాంకేతికత యొక్క ఒక ఉత్పాదన. ఉపయోగించుటకు తేలికగా యుండి, ఒక సహజ సుందరమైన సౌందర్యం దీర్ఘ కాలం నిలిచి యుండేలా అది మీ శిరోజాలకు సమకూరుస్తుంది.




గోద్రెజ్ వారినుండి ఒక సుప్రసిద్ధమైన పౌడర్ హెయిర్ డై

Mudra:B:GS:1096:1117:TL